కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి





ధర్నా, నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న టీపీజేఏసీ, నేషనల్ అలయన్స్ ఆఫ్ పీపుల్స్ మూమెంట్ ప్రతినిధులు

చిక్కడపల్లి, మే 20 (ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని, తెలంగాణ ప్రభుత్వం కార్మికులకు ఇచ్చిన హామీలను అమలుచేయాలని ధర్నా చేశారు. మంగళవారం ఆర్టీసీక్రాస్‌రోడ్‌లోని తెలంగాణ కార్మిక కమిషనరేట్ ఎదుట తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ(టీపీజేఏసీ), నేషనల్ అలయన్స్ ఆఫ్ పీపుల్స్ మూమెంట్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె అనివార్యకారణాల వల్ల జూలైకు వాయిదా పడిందన్నారు. దీంతో వివిధ స్థాయిల్లో కార్మికులు, రైతులు నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని కేంద్ర సంఘాలు పిలుపిచ్చాయన్నారు. ఈ మేరకు మంగళవారం కార్మిక కమిషనరేట్ ఎదుట నిరసన ప్రదర్శన, ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా టీపీజేఏసీ కోకన్వీనర్ కన్నెగంటి రవి, దళిత బహుజన ఫ్రంట్ జాతీయ ప్రధానకార్యదర్శి పి.శంకర్, ఎన్ఏపీఎమ్ జాతీయ కమిటీ సభ్యులు మీరా సంఘమిత్ర మాట్లాడారు. రాష్ట్రంలో కార్మికులు, ప్రయివేట్ రంగ ఉద్యోగుల సంఖ్య పెరుగుతున్న దృష్ట్యా రాష్ట్ర కార్మికశాఖను బలోపేతం చేయాలని, ఇతర డిమాండ్‌లను పరిష్కరించాలని నినదించారు. అనంతరం కార్మికశాఖ అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఖలీదాపర్వీన్, డా.ఉస్మాన్, సిస్టర్‌లిజి, మంజుల, సామ్రాజ్యం, సలావుద్దీన్, ఖలీల్, సరస్వతి, జయలక్ష్మి, రవిచందర్ తదితరులు పాల్గొన్నారు.

పాత 29 కార్మిక చట్టాలను పునరుద్ధరించాలి

● కేంద్ర కార్మిక సంఘాల భారీ ధర్నా



కేంద్ర రీజినల్ లేబర్ కమిషనర్ కార్యాలయం వద్ద నేతలు, కార్మికుల ధర్నా

నల్లకుంట, మే 20 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన దుర్మార్గపు కొత్త నాలుగు కార్మిక కోడ్‌లను రద్దుచేసి, పాత 29 కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని కేంద్రకార్మిక సంఘాల వేదిక నేతలు డిమాండ్ చేశారు. మంగళవారం విద్యానగర్‌లోని కేంద్ర రీజినల్‌లేబర్ కమిషనరేట్ వద్ద కేంద్ర కార్మిక సంఘాల సంయుక్త వేదిక, సంయుక్త కిసాన్‌మోర్చాల ఆధ్వర్యంలో కార్మికులు, రైతులతో భారీధర్నా నిర్వహించారు. ప్లకార్డులు, జెండాలు చేతపట్టి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ భారీ ధర్నాలో కేంద్ర కార్మిక సంఘాల సంయుక్తవేదిక, సంయుక్త కిసాన్ మోర్చా నాయకుడు ఎస్.బాలరాజ్ (ఏఐటీయూసీ), పాలడుగు భాస్కర్ (సీఐటీయూ), కె.సూర్యం (టీయూసీఐ), ఎం.శ్రీనివాస్ (ఐఎఫ్‌టీయూ), ఆర్‌డీ.చంద్రశేఖర్(ఐఎన్‌టీయూసీ), పశ్యపద్మ, టి.సాగర్ (తెలంగాణరాష్ట్ర రైతు సంఘం) మాట్లాడారు. మోదీ ప్రభుత్వం ఫాసిస్ట్ ప్రభుత్వంగా మారి, కార్మిక, రైతు, ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని ఆరోపించారు. ఈ సందర్భంగా తమ డిమాండ్లతో కేంద్ర రీజినల్ లేబర్ కమిషనర్‌కు నేతలు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో నాయకులు ప్రేమపావని, ఎం.నరసింహ, బి.వెంకటేశం, కె.యాదగిరి, బి.కిషన్, ఎం.ప్రవీణ్‌కుమార్, జె.వెంకటేష్, కుమారస్వామి, ఈశ్వర్‌రావు, ఎస్.ఎల్.పద్మ, లింగంగౌడ్, శ్రీనివాస్, జి.అనురాధ, విజయ్‌కుమార్, మల్లేష్‌గౌడ్ పాల్గొన్నారు.



కార్మిక సంయుక్త కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న జేఏసీ నేతలు

నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

బహుజన వామపక్ష కార్మిక సంఘాల జేఏసీ

చిక్కడపల్లి, మే 20 (ఆంధ్రజ్యోతి): బీజేపీ నేతృత్వంలోని కేంద్రప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలని బహుజన వామపక్ష కార్మిక సంఘాల జేఏసీ డిమాండ్ చేసింది. మంగళవారం బహుజన వామపక్ష కార్మికసంఘాల జేఏసీ నేతలు రాష్ట్ర కార్మికశాఖ సంయుక్త కమిషనర్ చంద్రశేఖరంను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జేఏసీ ప్రతినిధులు తుమ్మల ప్రఫుల్‌రాంరెడ్డి, షేక్‌షావలి, కల్లెపు చంద్రశేఖర్‌ప్రసాద్, కనకం అంజనేయులు, పి.సునీత, ప్రభాకర్ తదితరులు మాట్లాడుతూ కనీస వేతనం రూ.30వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈపీఎఫ్ పెన్షన్ రూ.15 వేలు అమలు చేయాలని, బీడీ పరిశ్రమపై కేంద్రప్రభుత్వం ఆంక్షలను ఎత్తివేయాలని, ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించేవరకు కోప్టా 2013 చట్టాన్ని అమలు చేయవద్దని కోరారు. జూలై 9న జరిగే జాతీయ సమ్మెలోపు ఈ డిమాండ్ పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ ప్రతినిధులు మల్లేశ్, రాంబాబు, రేణుక, ఎస్.రవి, యాదగిరి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

నిజాం రాచరికంపై పోరాడిన ధీశాలి బండి యాదగిరి



మాట్లాడుతున్న జస్టిస్ కాశీవిశ్వేశ్వర్‌రావు, పక్కన కళాజనార్దనమూర్తి తదితరులు

చిక్కడపల్లి, మే 20 (ఆంధ్రజ్యోతి): నిజాం రాచరిక పాలనపై పోరాడిన ధీశాలి బండి యాదగిరి అని విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ కాశీవిశ్వేశ్వర్‌రావు అన్నారు. 'ఎందరో మహానుభావుల మధురస్మృతులు' కార్యక్రమంలో భాగంగా మంగళవారం త్యాగరాయ గానసభ ఆధ్వర్యంలో అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షతన విప్లవకవి బండి యాదగిరి సంస్మరణ సభ జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన జస్టిస్ కాశీవిశ్వేశ్వర్‌రావు మాట్లాడుతూ ప్రపంచ చరిత్రలో ప్రాచుర్యం పొందిన వీర తెలంగాణ పోరాట ఘట్టంలో స్వయంగా రాసి పాడిన 'బండెనక' పాట నాడే కాదు నేడూ పోరాటస్ఫూర్తిని కలిగిస్తుందన్నారు. నిజాం గుండెలను దడదడలాడించిన పాటను వింటే మట్టి మనుషులు సాగించిన సాయుధ విప్లవ రైతాంగ పోరాటం స్ఫూర్తినిస్తుందన్నారు. యాదగిరి అక్షరాలకు నోచుకోకపోయినా ఆయుధాల్లాంటి పాటలు రాసి ప్రజలను మేల్కొల్పాడని పేర్కొన్నారు. సభలో మానస ఆర్ట్స్ సంస్థ అధినేత రఘుశ్రీ, కేంద్ర ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యుడు ఎస్‌బీ.రామ్, నైషధం సత్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రవాదాన్ని అణచివేయాలి : బీజేపీ



కవాడిగూడలో జరిగిన తిరంగా ర్యాలీలో భరత్‌గౌడ్,రమేష్ రామ్, కార్పొరేటర్ రచనశ్రీ

కవాడిగూడ: మే 20 (ఆంధ్రజ్యోతి): పాక్ ప్రేరేపిత ఉగ్రవాద సంస్థలను కూకటి వేళ్లతో అణచేయాలని, ఆ దిశగా చర్యలు తీసుకుంటున్న భారత ప్రధాని నరేంద్రమోదీకి దేశ సైనికులకు ప్రతి ఒక్కరూ అండగా ఉండాలని బీజేపీ మహంకాళి జిల్లా నగర అధ్యక్షుడు జి.భరత్‌గౌడ్ పిలుపునిచ్చారు. మంగళవారం రాత్రి కవాడిగూడ డివిజన్ వైస్రాయ్ చౌరస్తాలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో భరత్ గౌడ్‌తో పాటు ముషీరాబాద్ బీజేపీ కన్వీనర్ మల్లంపేట రమేష్‌రామ్, కవాడిగూడ కార్పొరేటర్ జి.రచనశ్రీ, బీజేపీ రాష్ట్ర నాయకులు జి.వెంకటేష్, పూసరాజు, నవీన్‌గౌడ్, నగర నాయకులు ఎంసీ మహేందర్‌బాబు, బీజేపీ డివిజన్ అధ్యక్షుడు సలంద్రి దిలీప్ యాదవ్, ప్రధాన కార్యదర్శులు ఏ.ప్రభాకర్ గంగపుత్ర, మురారిశెట్టి కేశవ్, కృష్ణహరి, పీఎన్‌చారి, బియ్యం శ్రీను, శేరిపల్లి గణేష్, నాయకులు రామ్‌రెడ్డి, మద్దూరి శివాజీ, చిత్రకుమార్ గౌడ్, బొల్ల రమేష్, శక్తిసింగ్, ఉమేష్, అనిల్, నరసింహ చారి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టంగుటూరి ప్రకాశానికి నివాళి



ఆంధ్రరాష్ట్ర తొలి సీఎం టంగుటూరి ప్రకాశం పంతులు వర్ధంతి సందర్భంగా మంగళారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర నాయకుడు, టీడీపీ రాష్ట్ర నాయకుడు నైషధం సత్యనారాయణమూర్తి, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ ఆర్.శేషసాయి తదితరులు పాల్గొన్నారు.
- రాంనగర్, ఆంధ్రజ్యోతి

యాదుల్లాకు ఓయూ డాక్టరేట్



ప్రొ.మాయాదేవి నుంచి డాక్టరేట్ అందుకుంటున్న ఉపాధ్యాయుడు మహ్మద్ యాదుల్లా

చాదర్‌ఘాట్, మే 20 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న దిల్‌సుఖ్‌నగర్ నివాసి మహ్మద్ యాదుల్లా ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకున్నారు. విదేశీ హిందీ సాహిత్యంపై చేసిన పరిశోధనకు గాను ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. గౌరవ ప్రదమైన డాక్టరేట్ సాధించడంలో తనకు అన్ని విధాల సహకరించిన డాక్టర్ సంగీత వ్యాస్ తదితరులకు యాదుల్లా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ జగన్, సీఐ జగదీశ్వర్‌రావు

జల్సాల కోసం సెల్‌ఫోన్‌ల చోరీ

రాంనగర్, మే 20 (ఆంధ్రజ్యోతి): శానిటేషన్ కార్మికులుగా పనిచేస్తూ జల్సాల కోసం సెల్‌ఫోన్ దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు దొంగలను నల్లకుంట పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి బైక్, మొబైల్ సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం నల్లకుంట పీఎస్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను ఓయూ ఏసీపీ జగన్, నల్లకుంట పీఎస్ సీఐ జగదీశ్వర్‌రావు వెల్లడించారు. అంబర్‌పేటలోని బతుకమ్మకుంటలో నివాసం ఉంటున్న ప్రణీష్(22), చీగుర్ల సురేష్(20), అరుణ్‌కుమార్(20) శానిటేషన్ కార్మికులు. వీరు జల్సాలకు అలవాటు పడి డబ్బులు సరిపోకపోవడంతో సెల్‌ఫోన్ దొంగతనాలు చేస్తున్నారు. వీరిపై ఫిర్యాదులు రావడంతో నల్లకుంట పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా సెల్‌ఫోన్ దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నారు. దీంతో వీరిని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహం స్వాధీనం



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

చిక్కడపల్లి, మే 20 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహాన్ని చిక్కడపల్లి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గోల్కొండ చౌరస్తాలోని 1088 మెట్రోపిల్లర్ వద్ద 50సంవత్సరాల వయస్సున్న వ్యక్తి పడుకుని ఉన్నాడు. పోలీసులు గుర్తించి 108అంబులెన్స్‌ను పిలిపించి చూడగా అప్పటికే అతను మరణించాడు. మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సంబంధీకులు లేదా వివరాలు తెలిసినవారు పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని ఇన్‌స్పెక్టర్ రాజునాయక్ సూచించారు.

హిమాయత్‌నగరలో మహిళ అదృశ్యం



గీతాంజలి సైకియా

కవాడిగూడ, మే 20 (ఆంధ్రజ్యోతి): దోమలగూడలో ఓ మహిళ అదృశ్యమైంది. ఈ సంఘటన దోమలగూడ పిఎస్ పరిధిలోని హిమాయత్‌నగరలో జరిగింది. దోమలగూడ ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. హిమాయత్‌నగర్‌స్ట్రీట్ నెంబర్1లో అస్సాం రాష్ట్రానికి చెందిన దీపు మోనిసైకియా(43), గీతాంజలి సైకియా(30) దంపతులు వారి కుమారుడు రిషాంత్ సైకియాతో కలిసి నివాసం ఉంటున్నారు. దీపుమోని సైకియా మెహదీపట్నంలోని ఓ గోల్డ్‌షాపులో సేల్స్‌మెన్. విధులు ముగించుకొని ఈనెల 11న రాత్రి 11 గంటల సమయంలో తిరిగి ఇంటికి వచ్చేసరికి అతని భార్య గీతాంజలి సైకియా కనిపించలేదు. ఈ మేరకు దోమలగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఆమె ఆచూకీ తెలిసిన వారు దోమలగూడ పోలీసలోస్టేషన్‌లో గానీ ఫోన్ నెంబర్ 8712661525లో గానీ సంప్రదించాలని ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి కోరారు.

క్లాస్ ఫోర్ ఉద్యోగులు, జవాన్ల సమస్యలు పరిష్కరించాలి

రాంనగర్, మే 20 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీలో పనిచేస్తున్న క్లాస్ ఫోర్ ఉద్యోగులకు కొబ్బరినూనె, చెప్పులు, సబ్బులు, డ్రెస్‌లు, చీరలు, టవల్స్, సీజినల్ డ్రెస్‌లను వెంటనే మంజూరు చేయాలని జీహెచ్ఎంసీ భాగ్యనగర్ మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు ప్రకాష్, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీధర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు సంవత్సరాలకు ఉద్యోగులకు ఇవ్వాల్సిన పరికరాలు ఇవ్వడం లేదన్నారు. శానిటరీ జవాన్ల పోస్టుల నుంచి ఏఎంటీ పోస్టులకు ప్రమోషన్లు కల్పించాలని కోరారు. క్లాస్ ఫోర్ ఉద్యోగులందరినీ బీఎల్‌వో విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. పదో తరగతి పాసైన ఉద్యోగులను మాత్రమే బీఎల్‌వోగా పెట్టాలన్నారు. హెల్త్‌గ్రౌండ్‌పై వారు కోరుకున్న చోటకు ట్రాన్స్‌ఫర్ చేయాలన్నారు. తమ డిమాండ్లను పరిష్కరించి చర్యలుచేపడతామని కమిషనర్ హామీ ఇచ్చారని వారన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ఉపాధ్యక్షుడు బసవన్న, ప్రధాన కార్యదర్శి ఆస్రాఫ్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

తల్లి మందలించడంతో బాలిక అదృశ్యం

బర్కత్ పుర మే 20 (ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్ అతిగా చూడొద్దని తల్లి మందలించడంతో తీవ్ర మనస్థాపానికి గురైన ఓ బాలిక ఇంటి నుంచి వెళ్లిపోయింది. కాచిగూడ ఎస్ఐ నరేష్‌కుమార్ వివరాల ప్రకారం.. గోల్నాక వెంకటేశ్వరనగర్‌లో నివాసం ఉంటున్న ధరంపాల్ కుమార్తె ఆగా తనుషా(16) 10వ తరగతి పూర్తిచేసింది. సెల్ ఫోన్ బాగా చూస్తుండడంతో తల్లి వరలక్ష్మి మందలించింది. దీంతో మంగళవారం ఉదయం ఇంటి నుంచి వెళ్లిపోయింది. వెతికినా బాలిక ఆచూకీ లభించలేదు. ఈ మేరకు తల్లి ఫిర్యాదు చేయడంతో మిస్సింగ్ కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేష్‌కుమార్ తెలిపారు.



సునీల్ పార్థీవ దేహానికి నివాళులర్పిస్తున్న బ్రాహ్మణ సంఘాల నేతలు

సునీల్‌కు అంతిమ వీడ్కోలు

నల్లకుంట, మే 20 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి రాష్ట్ర కోశాధికారి, వైష్ణవి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంత్రి సునీల్ అంతిమయాత్ర మంగళవారం సత్‌భావన రాజీవ్ స్వగృహ బండ్లగూడ నుంచి అంబర్‌పేటలోని హిందూ శ్మశాన వాటిక వరకు సాగింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు పోచంపల్లి రమణారావు, వర్కింగ్ ప్రెసిడెంట్ చెన్నూరి లక్ష్మీనరసింహారావు, ఉపాధ్యక్షులు కె.శ్యామసుందర్‌రావు, దేవులపల్లి రంగారావు, నాయకులు దేవులపల్లి బాలచంద్రరావు, గంప రామాశర్మ, దేవులపల్లి అశోక్‌కుమార్, గూడ జయరాం, అక్కిరాజు దుర్గాప్రసాద్, రాజేశ్వరరావు, సర్వరఘు, దేవులపల్లి శేషగిరిరావు, రమేష్‌కుమార్, ప్రసాదరావు, శ్రీనివాసరావు, కరుణాకర్‌రావు, రామారావు, వెంకటరమణ, రాఘవేందర్, న్యాయవాది మంత్రి రవీందర్, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ దేవులపల్లి శేషుకుమారి, దివంగత మంత్రి సునీల్ భార్య సౌజన్య, కుమారుడు రుత్విక్, ఆయన సోదరుడు మంత్రి సుధీర్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ



చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వెంకటేష్

బర్కత్‌పుర, మే 20 (ఆంధ్రజ్యోతి): షాదీ ముబారక్, కల్యాణ లక్ష్మీ పథకాలను తీసుకొచ్చిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌దేనని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. మంగళవారం హిమాయత్‌నగర్ తహసీల్దార్ కార్యాలయం వద్ద షాదీ ముబారక్ చెక్కులను కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమాదేవి, తహసీల్దార్ సంధ్యారాణితో కలిసి ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్ పాల్గొన్నారు.

డ్రైనేజీ పైప్‌లైన్ల సమస్య పరిష్కరించాలి

నల్లకుంట, మే 20 (ఆంధ్రజ్యోతి): నల్లకుంట డివిజన్‌లోని గోల్నాక కల్లు కాంపౌండ్ వద్ద పురాతనమైన డ్రైనేజీ పైప్‌లైన్లు మంగళవారం ఉదయం కూరుకుపోయాయి. ఈ దారిగుండా రాకపోకలు సాగించడంలో పాదచారులు, వాహనదారులకు ప్రమాదకరంగా మారింది. దీంతో స్థానిక ప్రజలు కార్పొరేటర్ యాకర అమృత వెంటనే ఆ ప్రాంతాన్ని సందర్శించి, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఈ సమస్యను పరిష్కరించాలని ఆమె సూచించారు. త్వరలో సమస్యను పరిష్కరిస్తామని అధికారులు ప్రజలకు హామీ ఇచ్చారు.

రోహిణ్‌రెడ్డిని కలిసిన కాంగ్రెస్ నాయకులు



కాంగ్రెస్ ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రోహిణ్‌రెడ్డిని కలిసిన నేతలు

నల్లకుంట, మే 20 (ఆంధ్రజ్యోతి):కాంగ్రెస్ పార్టీ అంబర్‌పేట నియోజకవర్గం సీనియర్ నాయకుడు ఎస్.హరినాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సి.రోహిణ్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిసి, సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నల్లకుంట డివిజన్ అధ్యక్షుడు జి.లక్ష్మణ్, నాయకులు కేపీ.మురళీకృష్ణ, దేవిరెడ్డి విజితారెడ్డి, సీహెచ్.మురళీకృష్ణ, జి.మధుసూదన్, విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

రాంనగర్, మే 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రోహిణ్‌రెడ్డి సూచించారు. మంగళవారం డాక్టర్ రోహిణ్‌రెడ్డికి పార్టీ జిల్లా ప్రధానకార్యదర్శి తొలుపునూరి కృష్ణగౌడ్ అంబర్‌పేట నియోజకవర్గం పార్టీ నాయకులతో కలిసి పూలబొకే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి అమలుచేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజల వద్దకు చేర్చాలన్నారు.

ముగిసిన స్వామివారి బ్రహ్మోత్సవాలు



డోలోత్సవంలో పాల్గొన్న భక్తులు

చిక్కడపల్లి, మే 20 (ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న స్వామివారి బ్రహ్మోత్సవాలు ముగిశాయి. మంగళవారం నిర్వహించిన పలు పూజలు, అభిషేకాలు, అర్చనల కార్యక్రమాలకు భక్తులు పోటెత్తారు. ఆలయ వ్యవస్థాపక వంశీయుడు రాజేంద్రనాథ్‌గౌడ్ కుమారుడు శ్రీనాథ్‌గౌడ్, కీర్తి దంపతులు, ఈవో అన్నపూర్ణ పాల్గొన్నారు.

ద నేషనల్ అంబేడ్కర్ సేన రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రవి



రవికి నియామకపత్రం అందజేస్తున్న మన్నె శ్రీధర్‌రావు, రాజేష్ తదితరులు

నల్లకుంట, మే 20 (ఆంధ్రజ్యోతి): ద నేషనల్ అంబేడ్కర్ సేన (డీఎన్ఏఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నల్లకుంట డివిజన్ తిలక్‌నగర్‌కు చెందిన బత్తుల రవి నియమితులయ్యారు. ఈ మేరకు ద నేషనల్ అంబేడ్కర్ సేన జాతీయ అధ్యక్షుడు మన్నె శ్రీధర్‌రావు, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు తాలుకా రాజేష్ మంగళవారం ఆయనకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బత్తుల రవి విలేకరులతో మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ సిద్ధాంతాలు, ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్తానన్నారు.

దళిత ఎంపీ వంశీని అవమానించిన మంత్రులు



లోయర్ ట్యాంక్‌బండ్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఉస్తాద్‌రాజు, చెన్నయ్య దళిత, మాల సంఘాల నేతలు

కవాడిగూడ, మే 20 (ఆంధ్రజ్యోతి): దళిత ఎంపీ గడ్డం వంశీని ఉద్దేశపూర్వకంగానే రాష్ట్ర మంత్రులు అవమానించారని పలు మాల, దళిత సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు లోయర్ ట్యాంక్‌బండ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆందోళన చేపట్టాయి. షెడ్యూల్డు కులాల హక్కుల పరిరక్షణ సమితి జాతీయ అధ్యక్షుడు ఉస్తాద్‌రాజు మొదట బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మంగళవారం పలు మాల సంఘాల, దళిత సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో భారీఎత్తున నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మంత్రులు కొండా సురేఖ, శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్, దేవాదాయ మున్సిపల్ కమిషనర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య, దళిత సంఘాల సంఘాల ప్రతినిధులు బిట్ల వెంకటేశ్వర్లు, వినయ్‌కుమార్, వినోద్, వెంకటేష్ తదితరులు మాట్లాడారు. మాల వారియర్స్ వ్యవస్థాపకులు శ్రీనివాస్, వివిధ సంఘాల నేతలు కిషన్, బిట్ల వెంకట్, దాసరి విశాల్, మన్నె శ్రీధర్‌రావు, బాలకృష్ణ, నవీన్, సుధీర్, ప్రభావతి, నాయకులు పాల్గొన్నారు.

శ్రీవారి వాహన వైభవం పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రముఖ వేదపండితులు

చిక్కడపల్లి, మే 20 (ఆంధ్రజ్యోతి): కలియుగదైవం వేంకటేశ్వరస్వామి వైభవాన్ని వివరించే 'శ్రీవారి వాహన వైభవం' పుస్తకావిష్కరణ సభ మంగళవారం రాత్రి త్యాగరాయ గానసభలో జరిగింది. ప్రముఖ వేదపండితులు జిల్లెళ్ల సుబ్బరాయశాస్త్రి రచించిన ఈ పుస్తకాన్ని ఆయన జయంతిని పురస్కరించుకుని ఆవిష్కరించారు. ఆయన సోదరుడు వారణాశి ఆంజనేయశాస్త్రి పుస్తక రచనకు తుదిమెరుగులు దిద్దారు. వేదపండితులు, ఆధ్యాత్మిక ప్రముఖులు ఎంఎస్ఆర్ ఆంజనేయశర్మ, మేడిపల్లి వెంకట్రామశర్మ, సురభి శంకరశర్మ, జయరాం భట్టాచార్యులు, లక్ష్మీనరసింహాచార్యులు, వరప్రసాద్, శ్రీరామకవచం జగన్‌శర్మ, నరసింహమూర్తి, పార్థసారథి, సర్వపాపయ్యశాస్త్రి అతిథులుగా పాల్గొన్నారు.

డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ విద్యా సంస్థలపై న్యాక్ సంతృప్తి

ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి,



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి, ప్రొ.లింబాద్రీ, డాక్టర్ సరోజ తదితరులు

రాంనగర్, మే 20 (ఆంధ్రజ్యోతి): పేదవర్గాల విద్యార్థులకు డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ విద్యాసంస్థలు అందిస్తున్న విద్యాసేవల పట్ల న్యాక్ అధికారులు సంతృప్తి వ్యక్తం చేశారని డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ విద్యా సంస్థల చైర్మన్, ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు. మంగళవారం బాగ్‌లింగంపల్లిలోని డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ లా కళాశాల నిర్వహణ, పనితీరు, అందిస్తున్న విద్యాసేవలపై కళాశాల యాజమాన్యం, అధ్యాపకులతో న్యాక్ చైర్మన్, ముగ్గురు సభ్యులు, కో-ఆర్డినేటర్లు వర్చువల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ విద్యా సంస్థల ఏర్పాటు లక్ష్యాలను ఇక్కడ కొనసాగుతున్న లా కళాశాలతోపాటు డిగ్రీ, ఇంటర్, హైస్కూల్ పనితీరు, విద్యావిధానం, మౌలికవసతుల గురించి వివరించామని చెప్పారు. దీంతో న్యాక్ టీమ్ సంతృప్తి వ్యక్తం చేసిందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ జి.వినోద్, కరస్పాండెంట్ సరోజ వివేక్, జాయింట్ సెక్రటరీ రమణ, డైరెక్టర్ విష్ణుప్రియ, ప్రిన్సిపాల్ సృజన, ప్రియాఆంగార్ తదితరులు పాల్గొన్నారు.